క్లుప్తంగా

రేపు చీమకుర్తిలో వైద్యశిబిరం

చీమకుర్తి: కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న చీమకుర్తి కొత్తకుమ్మరిపాలెం రామాలయం వద్ద కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకురాలు ఏవీ అశ్విని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరానికి హాజరయ్యే రోగులకు డాక్టర్లతో వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. చీమకుర్తి పట్టణ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

24న మండల సర్వసభ్య సమావేశం

చీమకుర్తి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన 24వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీజే వండర్‌మ్యాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందచేత



విద్యార్థికి ల్యాబ్‌టాప్ అందచేస్తున్న ట్రస్టు సభ్యులు

ఒంగోలు అర్బన్: చదువులో రాణిస్తున్న పేద విద్యార్థిని పి.హేమలతకు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ల్యాబ్‌టాప్‌ను గురువారం ట్రస్ట్ కార్యాలయంలో అందచేశారు. జేఈఈలో 978 మార్కులు సాధించిన హేమలత తనకు ల్యాబ్‌ట్యాప్ అవసరమని సహాయం చేయాలని ట్రస్ట్‌ను సంప్రదించడంతో ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాషా స్పందించి శివం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొల్లపూడి శ్రీహరి ద్వారా రూ.52 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను విద్యార్థికి అందజేశారు. చదువులో రాణిస్తూ పేదరికంలో ఉన్న విద్యార్థులకు రెండు సంస్థలు అండగా ఉంటాయన్నారు. గతంలో ఇదే విద్యార్థికి కాలేజీ ఫీజు కోసం రూ.1.50 లక్షలు అందచేసినట్లు గుర్తు చేశారు.

మండల పరిషత్‌లో అవినీతిపై విచారణ

నాగులుప్పలపాడు: మండల పరిషత్ నిధులు అప్పటి ఇన్‌చార్జి ఎంపీడీవో, కార్యాలయ ఏవో తమ సొంత ఖాతాలకు మళ్లించుకున్నారంటూ ఆధారాలతో కలెక్టర్‌కు మండల పరిషత్ అధ్యక్షురాలు నలమలపు అంజమ్మ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. గురువారం డిప్యూటీ సీఈవో హనుమంతరావు మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రెండేళ్ల కిందట జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి వచ్చిన అభ్యర్థుల డిపాజిట్‌లు, ఎన్నికల నిర్వహణ అధికారులకు చెల్లించాల్సిన నిధులను కార్యాలయ ఏవోతో పాటు ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన శ్రీనివాసరావు తన సొంత ఖాతాలకు డిపాజిట్ చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. విచారణ చేపట్టినట్టు విచారణాధికారి హనుమంతరావు తెలిపారు.

మండల కన్వీనర్‌గా బత్తుల




శ్రీనును అభినందిస్తున్న మండవ అప్పారావు, వాకా కోటిరెడ్డి

మద్దిపాడు: మండల కన్వీనర్‌గా దొడ్డవరం గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావును ఎంపిక చేయడంపై పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు శ్రీనివాసరావుకు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. మండలంలోని మల్లవరం విజయ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువకుడైన బత్తుల శ్రీనివాసరావును మండల కన్వీనర్‌గా ఎంపిక చేయడంతో యువతకు ప్రాధాన్యం ఇచ్చినట్లయిందని మండల పార్టీ అధ్యక్షుడు తెలిపారు. వారి వెంట సీనియర్ నాయకుడు గట్టినేని అయ్యన్న, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, ఎంపీటీసీ వాకా అరుణ కోటిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డును మింగేసిన టీడీపీ నేత



రోడ్డులో అడ్డంగా నిర్మించిన రూము, రూంకు ముందు భాగంలో మురుగు కాలువపై అధికారులు నిర్మించిన సీసీ స్లాబు



గూగుల్ మ్యాప్‌లో సోనియాగాంధీ నాల్గో లైన్‌ను చూయిస్తున్న చిత్రం

- సుజాత నగర్ పరిధిలోని సోనియాగాంధి నగర్‌లో అక్రమాలు
- రోడ్డును మూసేసి రూము నిర్మాణం
- నకిలీ పొజిషన్ సర్టిఫికెట్ చూయించి మరీ అక్రమాలు
- అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మాణం
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బాలినేనికి గోడు వెల్లబోసుకున్న బాధితులు.

ఒంగోలు సబర్బన్: తహసీల్దార్ పేరుతో నకిలీ సర్టిఫికెట్ సృష్టించి రోడ్డునే కబ్జా చేయబోయింది ఓ తెలుగుదేశం నేత. నకిలీలతో కార్పొరేషన్ అధికారులను బురిడీ కొట్టించబోయింది. ఒంగోలు నగరంలో గడగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో తిరుగుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి స్థానికులు ఈ విషయాన్ని తీసుకువచ్చారు. దీనిపై ఆరా తీయగా సదరు టీడీపీ నేత పాల్పడిన అక్రమాలు వెలుగుచూశాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నగర శివారు సుజాతానగర్ పరిధి సోనియాగాంధీ నగర్‌లో నివాసముంటున్న మహిళా తెలుగుదేశం నేత ప్రసన్న. అక్కడ పేదల కోసం ప్రభుత్వ పట్టాలు ఇచ్చింది. 1990లో సర్వే నంబర్-218, ప్లాట్ నంబర్ 20ఏ పేరిట ఒకటింపాతిక సెంటు పట్టా ఇచ్చారు. వెరొకరి పేరున ఉన్న పట్టాను ఆమె దర్జాగా లాగేసుకుందన్న ఆరోపణలున్నాయి. అంతే కాదు తాను కొనుగోలు చేసుకున్నట్టు అగ్రిమెంట్ కూడా తయారు చేసుకుంది. ఇప్పటికే సోనియాగాంధీ నగర్‌లోనే బోలెడు ఆస్తి ఉన్న ప్రసన్న.. నిబంధనలకు విరుద్ధంగా అసైన్‌మెంట్ పట్టాను కొనుగోలు చేసినట్లు అధికారులను నమ్మించే పనిలో పడింది.

నకిలీ పొజిషన్ సర్టిఫికెట్ సృష్టించి మరీ....

అసైన్‌మెంట్ పట్టా కొనుగోలు నిబంధనలకు విరుద్ధమని తెలిసి ఆ స్థలాన్ని ఏ విధంగానైనా దక్కించుకోవాలన్న దుర్బుద్ధితో 61/2022 నంబర్‌తో నకిలీ పొజిషన్ సర్టిఫికెట్‌ను తయారు చేసుకున్నారు. ఆ తరువాత ఆ రోడ్డులో అక్రమ నిర్మాణాన్ని చేపట్టింది. అక్రమ నిర్మాణం చేపడుతున్నా ఒంగోలు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. మున్సిపల్ అధికారులు ఆ రోడ్డు మురుగు కాలువ మీద సీసీ స్లాబు నిర్మాణం చేపట్టారు. నాలుగో లైన్‌లో వెనుక ఉండే వారికి విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైను కూడా లాగారు. అయినా ఇంత చేస్తున్నా తహశీల్దార్ కార్యాలయం అధికారులు, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ చివరకు నకిలీ సర్టిఫికెట్లను, దొంగ సర్టిఫికెట్లను ప్రోత్సహిస్తూ అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నార్న విమర్శలు ఉన్నాయి.

ఎమ్మెల్యే బాలినేని దృష్టికి తీసుకొచ్చిన బాధితులు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చారు. పేర్ల మోహన రావు, నూనె రవికుమార్‌లతో పాటు మరికొందరు సోనియాగాంధీ నగర్‌లో టీడీపీ నాయకురాలు వద్దినేని ప్రసన్న ఆమె భర్త వెంకట రమణయ్యలు చేస్తున్న అక్రమాలపై ఫిర్యాదు చేశారు. దీంతో బాలినేని.. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఏసీపీ కె.వెంకటేశ్వర్లును విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.



ఒంగోలు తహసీల్దార్ ఇచ్చారంటూ చూయిస్తున్న నకిలీ పొజిషన్ సర్టిఫికెట్

పొజిషన్ సర్టిఫికెట్ నకిలీది...

సోనియాగాంధి నగర్ నాలుగో లైన్‌లో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇచ్చారని చెప్పుకుంటున్న పొజిషన్ సర్టిఫికెట్ నకిలీది. వద్దినేని ప్రసన్న భర్త వెంకట రమణయ్య పేరుతో 61/2022 నంబర్‌తో చూపిస్తున్న పొజిషన్ సర్టిఫికేట్ తమ కార్యాలయం నుంచి ఇవ్వలేదు. ఇలాంటి నకిలీ సర్టిఫికేట్లు ఒంగోలు నగరంలో చాలా వెలుగు చూస్తున్నాయి. అలాంటివి తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– పి.మురళి, ఒంగోలు తహశీల్దార్...

రోడ్డు మీద ఇళ్లు వేసి బ్లాక్ మెయిల్ చేస్తోంది...



నకిలీ సర్టిఫికెట్లు, దొంగ సర్టిఫికెట్లు చూయించి రోడ్డు మీదనే అక్రమంగా వద్దినేని ప్రసన్న రూము నిర్మాణం చేపట్టింది. తమకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం లేదు. రోడ్డులో ఉన్న రూంను తొలగించాలంటే రూ.25 లక్షలు డిమాండ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేసి మమ్మల్ని భయపెడుతోంది. నాలుగో లైన్‌లో ఉండే వారందరికీ న్యాయం చేయాలని వేడుకుంటున్నాము.

– పేర్ల మోహన రావు, సోనియాగాంధి నగర్ నాలుగో లైన్ బాధితుడు...

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా వడ్డీ లేని రుణాలు



మాట్లాడుతున్న డీపీఎం, ఏపీఎం గోపినాథ్



పాల్గొన్న వీఓఏలు

ఒంగోలు రూరల్: డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ సంఘ సభ్యులకు వారి జీవనోపాధి ఏర్పాటు చేసుకునేందుకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని ఏపీఎం బి.గోపీనాథ్ తెలిపారు. ఒంగోలు మండల డీఆర్‌డీఏ వీవోఓ సమీక్షా సమావేశం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎంపీడీఓ కార్యలయ ఆవరణలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఎం మాట్లాడుతూ ఒంగోలు మండలంలో 230 మంది సభ్యులకు రూ.కోటి టార్గెట్‌గా ఇచ్చారని, అర్హులైన గ్రూపు సభ్యులకు రుణాలు అందిస్తామన్నారు. డీపీఎం డి.సుబ్బారావు మాట్లాడుతూ రుణం తీసుకున్న ప్రతి గ్రూపు సభ్యురాలు యూనిట్ ఏర్పాటుకు ఆయా గ్రూపు లీడర్ ఏర్పాట్లు చేయాలన్నారు. సంఘాలు సక్రమంగా నిర్వహించాలని, పుస్తక నిర్వహణ పారదర్శకంగా చేయాలని బకాయి ఉన్న గ్రూపులకు నోటీసులు జారీ చేయాలని వీఓఏలకు తెలిపారు.

పనితీరు మెరుగుపరుచుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంజీ వెంకటసుబ్బయ్య, చెంచులక్ష్మి, రమణయ్య మాట్లాడారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

నాగులుప్పలపాడు: క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరం కృషి చేద్దామని మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి అన్నారు. గురువారం మద్దిరాలపాడులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన నాయకులు, కన్వీనర్లకు పార్టీ బలోపేతంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పిచ్చిరెడ్డి మాట్లాడుతూ సంతనూతలపాడు శాసనసభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అలుపెరగకుండా ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్తున్నాడని, దానికి అనుగుణంగానే సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కూడా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ రాబోవు కాలంలో జగనన్న పాలనపై ప్రజలకు మరింత బాధ్యత కలిగేలా చేయడంలో మన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జిగా ఎంపికైన కొమ్మూరి సుధాకర్‌ను నాయకులు అభినందించారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, కూనం పూర్ణచంద్రరావు, కందుల డానియేలు, యోహాను, అన్ని గ్రామాల సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న పిచ్చిరెడ్డి

గాయపడిన వారికి చెక్కుల పంపిణీ

గుడ్లూరు: కందుకూరులో గత నెలలో జరిగిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రోడ్‌షోలో గాయపడిన మండలానికి చెందిన నలుగురుకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్ చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని తెట్టు గ్రామానికి చెందిన షేక్ మన్సూర్, మోచర్ల గ్రామానికి చెందిన గోచిపాతల రమేష్, దప్పళంపాడు గ్రామానికి చెందిన చెరుకూరి మాల్యాద్రి, గుండ్లపాలెం గ్రామానికి చెందిన మద్దులూరి రాగమ్మలు గాయ పడ్డారు. వారి వైద్య ఖర్చులు నిమిత్తం ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున మంజూరు చేయగా గురువారంచెక్కులను బాధితులకు అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ అంజలయ్య, వైఎస్సార్‌సీపీ మండల మీడియా అధికార ప్రతినిధి బిల్లా రమణయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. ప్రకృతి ఎరువుల తయారీపై కొత్తపట్నంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనజీవామృతం తయారు చేసి చూయించారు. ఎకరంలో వేరుశనగ పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తామన్నారు. ఆఖరి దుక్కిలో ఘన జీవామృతం వేయడం వల్ల భూమి సారవంతమవుతుందన్నారు. రానున్న రోజుల్లో నూరుశాతం ప్రకృతి వ్యవసాయం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే సగం మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు శ్రావణ్, రవి, రైతులు పాల్గొన్నారు.



ఘనజీవామృతాన్ని తయారు చేస్తున్న ఏఓ మోహన్‌రెడ్డి, రైతులు

ముగిసిన పోటీలు

ఒంగోలు: రామిరెడ్డి శ్రీనివాసరెడ్డి మెమోరియల్ క్రికెట్ అండ్ నెట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మొదటి బహుమతిని ఒంగోలు పీఎంకె సీసీ జట్టు గెలుచుకుంది. రెండో బహుమతి చీరాల మెమరీక్ జట్టు కైవసం చేసుకుంది. నెట్‌బాల్ పోటీల్లో మొదటి బహుమతిని కృష్ణా జిల్లా, రెండో బహుమతిని ప్రకాశం జిల్లా గెలుచుకున్నాయి. అనంతరం జరిగిన ముగింపు సభకు ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామిరెడ్డి శ్రీనివాసరెడ్డి మెమోరియల్ పేరుతో క్రికెట్, నెట్‌బాల్ పోటీలను నితిన్‌రాజ్ రెడ్డి ఆధ్వర్యంలో గత 8 ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కొల్లా మధు, కార్యక్రమ నిర్వాహకులు చిక్కాల కిరణ్‌కుమార్, మహేంద్ర, కార్పొరేటర్ జడ వెంకటేష్, పసుపులేటి శ్రీనివాసరావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.



క్రికెట్ విజేతగా నిలిచిన ఒంగోలు జట్టు

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తపట్నం: ఎలుకల మందు తిని ఆత్మహత్యయత్నం చేసిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని ఈతముక్కల సంజీవయ్య యానాది కాలనీకి చెందిన కందుకూరు మౌనిక(21)కు రెండేళ్ల క్రితం నాగరాజు అనే వ్యక్తితో వివాహమైంది. అయితే ఏడాది క్రితం జరిగినరోడ్డు ప్రమాదంలో నాగరాజుకు నడుములు విరిగిపోయాయి. పైకి లేచి పనులు చేసుకునే పరిస్థితి లేదు. దీంతో ఐదు నెలల క్రితం చిన్నగంజాంకు చెందిన వెంకటేష్‌తో వివాహం చేశారు. అయితే కొంత కాలం సజావుగా కాపురం చేసుకున్నారు. కొన్ని రోజులుగా వారి మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో మౌనికను ఇంట్లోనే ఉంచి బేల్దారి పనుల నిమిత్తం చెప్పకుండా హైదరాబాద్ వెళ్లాడు. అప్పటి నుంచి మౌనిక ఒక్కటే ఒంటరిగా ఉంటుంది. ఈ క్రమంలో సంక్రాంతికి చినగంజాంకు వెంకటేష్ రాగా అతన్ని కలిసేందుకు వెళ్లగా అతని బంధువులు ఒప్పుకోలేదు.

ఈ క్రమంలో మనస్తాపం చెందిన మౌనిక పుట్టింటికి వచ్చి ఈ నెల 14న ఎలుకుల మందు తిని ఆత్మహత్యయత్నం చేసింది. బంధువులు 108 వాహనంలో రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై కె.మధుసూదన్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

జగనన్న రుణం తీర్చుకుందాం..

- ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వచ్చే ఎన్నికల్లో ఆయన రుణం తీర్చుకుందామని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, జగనన్న సచివాలయ మండల రూరల్, అర్బన్ కన్వీనర్‌లకు పిలుపునిచ్చారు. వారితో కలిసి గురువారం సాయంత్రం బూచేపల్లి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేసీఎస్ రూరల్ కన్వీనర్‌గా చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డిని, అర్బన్ కన్వీనర్‌గా మంచా హరికృష్ణను ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నియమించారు.

వారితో పాటు సచివాలయ కన్వీనర్‌లు, గృహరథసారథులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల నుంచి సీఎంకు కృతజ్ఞతలు తీర్చుకునే విధంగా, రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు సచివాలయ కన్వీనర్‌లు, గృహరథ సారథులు కృషి చేయాలని ఎమ్మెల్యే టీజేఆర్ పిలుపునిచ్చారు. అనంతరం రూరల్ జేసీఎస్‌గా నియమితులైన మస్తాన్‌రెడ్డి, అర్బన్ జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ కలిసి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.



వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న జేసీఎస్ కన్వీనర్‌లు

వాహన చట్టాలపై అవగాహన అవసరం

ఒంగోలు: మోటార్ వాహనాల చట్టంపై ప్రతి డ్రైవర్, యజమాని అవగాహన కలిగి ఉండాలని రవాణాశాఖ మోటార్ వాహన తనిఖీ అధికారి ఎ.కిరణ్‌ప్రభాకర్ అన్నారు. స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రోడ్డు భద్రతపై వాహనం నడిపే వ్యక్తికి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా అనుకోని సమస్య వచ్చినా, వాహనం డ్రైవర్ కంట్రోల్ తప్పకుండా ఉండాల్సిన అవసరాన్ని గుర్తించుకోవాలన్నారు. ప్రమాదం జరిగితే పోయేది ప్రాణాలు కాదని, కొన్ని కుటుంబాల జీవితాలు అనే విషయాన్ని గమనించాలన్నారు.

ఓవర్ లోడ్, వాహన బాడీకి మించి లోడింగ్ వంటి వాటిని మోటార్ వాహనాల చట్టం అనుమతించదన్నారు. వాహనం నడిపే వారు తప్పనిసరిగా తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సాంకేతికమైన సమస్యలు లేకుండా వాహనాలకు ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మతులు చేయిస్తూ ఉండడం యాజమాన్య బాధ్యత అంటూ మోటారు వాహనాల చట్టంలోని పలు నిబంధనలను వివరించారు. సదస్సులో ఎంవీఐ ఎ.రామచంద్రరావు, సురేంద్ర ప్రసాద్, జయప్రకాష్, పలువురు లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న రవాణాశాఖ అధికారులు

నేడు వాకథాన్ ర్యాలీ:

ఉదయం 7.30గంటలకు ప్రకాశం భవనం వద్ద వాకథాన్ ర్యాలీని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రారంభించనున్నారు. ర్యాలీలో వాహనాల డీలర్లు, అసోసియేషన్, డ్రైవింగ్ స్కూల్, ఆటో రిక్షా అసోసియేషన్, టోల్ ప్లాజా సిబ్బంది, పొల్యూషన్ సెంటర్, కాలేజీ విద్యార్థులు వివిధ ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు పాల్గొంటారని ఎంఈఓ ఎ.కిరణ్‌ప్రభాకర్ తెలిపారు. అనంతరం పీవీఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరులో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతుల మీదుగా గురువారం నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని క్రిస్టియన్ యూత్ ఫోర్స్ ఇనమనమెళ్లూరు వారు పోతినేని శ్రీనివాసరావు అందించిన రూ.20,116 నగదు గెలుచుకున్నారు. రెండో బహుమతి రూ.15,116ని ఇనమనమెళ్లూరు యూత్ సభ్యులకు ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డి అందించారు. మూడో బహుమతి రూ.10,116 నగదును జిలగా కోటి ఆకుల శ్రీనివాస్‌లు అందించగా మద్దిపాడు కామ్రేడ్స్ జట్టు కైవసం చేసుకుంది. సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, మాజీ ఎంపీటీసీ యాదాల వెంకట్రావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పొదిలి రూరల్: రిక్షా, కారు ఢీ కొని ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన పొదిలి-దర్శి రహదారిలో రాంనగర్ వద్ద గురువారం జరిగింది. నరసరావుపేట నుంచి కనిగిరి వెళ్ళుతున్న కారుకు, పొదిలి రాంనగర్ వద్ద రిక్షా అడ్డురావడంతో ఢీకొట్టింది. రిక్షా పుల్లర్ రాములుకి గాయాలవడంతో పొదిలి ఆసుపత్రికి తరలించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కనిగిరి రూరల్: బోరింగ్ హ్యాండిల్ రాడ్డు కడుపులో గుచ్చుకుని తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..ఇందిరాకాలనీకి చెందిన నాగరాజు బుధవారం రాత్రి బైక్‌పై వేగంగా వస్తూ రాజీవ్‌నగర్‌లో రోడ్డుపై ఉన్న హ్యాండ్ బోరింగ్‌ను ఢీ కొనడంతో బోరింగ్ హ్యాండిల్ రాడ్డు కడుపులోకి దిగింది. వెంటనే స్థానికులు వెల్డింగ్ ద్వారా చేతి పంపు నుంచి హ్యాండిల్‌ను వేరు చేసి క్షతగాత్రున్ని ఒంగోలుకు తరలించారు. ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.